విద్యాకిరణ్‌లో ఘనంగా దీపావళి సంబురాలు



ఘట్‌కేసర్: పట్టణంలోని శివారెడ్డిగూడ విద్యాకిరణ్ హైస్కూల్‌లో శనివారం దీపావళి సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలను పూలు, అరటి, మామిడి ఆకులు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ధనలాభం కలగాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థినులను అష్టలక్ష్మీ దేవతా మూర్తులు రూపంలో అలంకరించారు. స్కూల్ కరస్పాండెంట్ రమేశ్, డైరెక్టర్ పుష్పలత, ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించడానికి దీపావళి వేడుకలు నిర్వహించామన్నారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

సెయింట్ పీటర్స్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీలత, సెక్రటరి టీవీ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కొత్తగా కళాశాలలో అడుగుపెడుతున్న విద్యార్థులకు స్వాగతం పలికేందుకు, విద్యార్థులు స్నేహభావంతో మెలిగేందుకు ఫ్రెషర్స్ డే దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, పీఆర్వో రవిసుధాకర్, ఏవో హరిప్రసాద్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువత కెరీర్‌కు 'మెషిన్ లర్నింగ్'



ఘట్‌కేసర్: మెషిన్ లర్నింగ్‌తో యువత కెరీర్ మెరుగుపడుతుందని మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్ మేనేజర్ రిసోర్స్ పర్సన్ ముస్కాన్ హండా అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)విభాగం ఎనిగ్మా క్లబ్ సహకారంతో శనివారం 'కృత్రిమ మేధా శక్తిని అన్‌లాక్ చేయడం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మెషిన్ లెర్నింగ్ ప్రాథమిక అంశాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భావనలు, ప్రస్తుత ప్రపంచంలో మెషిన్ లెర్నింగ్ ఎలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో అర్థం చేసుకోవడానికి విద్యార్థులకు సహాయపడుతుందన్నారు. కార్యక్రమంలో ఏఐ హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, ఈవెంట్ కోఆర్డినేటర్ శిల్ప, ఏఐ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెరినిటీ పాఠశాలలో దీపావళి వేడుకలు



కీసర: నాగారం సెరినిటీ పాఠశాలలో శనివారం విద్యార్థులు, ఉపాధ్యాయులు, దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దీపావళి పండుగ సందర్భంగా (ప్రమిద ఆకారం)లో విద్యార్థులు ప్రదర్శన చేపట్టారు. అదేవిధంగా దీపాలను వెలిగించి, క్రాకర్స్ కాల్చి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి, డైరెక్టర్ నోముల వసంత పాల్గొన్నారు.

సమ సమాజ స్థాపన కోసం పోరాడుదాం..

కుషాయిగూడ: సమ సమాజ స్థాపన కోసం విద్యార్థి లోకం నడుం బిగించాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్, పోడపంగి నాగరాజు అన్నారు. శనివారం ఈసీఐఎల్‌లోని వసుంధర కళాశాలలో అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. విద్యార్థి నేతలు జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలా శంకర్, చేరాలు, రంగవల్లికి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ నాయకులు తీగల శ్యామ్, యశ్వంత్ పాల్గొన్నారు.

అల్వాల్ లయోలలో పట్టభద్రుల దినోత్సవం

అల్వాల్: విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ గౌరవ కాన్సులేట్ డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీఖాన్ అన్నారు. శనివారం అల్వాల్ లయోల కళాశాలలో ఏర్పాటు చేసిన 8వ పట్టభద్రుల దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. ఐఏఎస్ దేవసేన, డాక్టర్ అశీష్ చౌహాన్, ప్రొ.ఎం.రాములు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రివేణి విద్యార్థి ప్రతిభ

అల్వాల్: ఇటీవల ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహించిన వీవీఎం పరీక్షలలో అల్వాల్ త్రివేణి విద్యార్థి అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. విద్యార్థులలో సైన్స్ పరంగా ఉన్న ప్రతిభను కనబర్చేందుకు నిర్వహించిన పరీక్షల్లో 6వ తరగతి చదువుతున్న జీ.లాస్య రాష్ట్రస్థాయిలో ఎంపికైంది. త్రివేణి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధా, సీఆర్‌ఓ వెంకట్‌రావులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

ఇంటింటి ప్రచారంలో మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి చామకూర మల్లారెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ సాయినగర్ కాలనీ, గురు ఎన్‌క్లేవ్‌లలో శనివారం గడప గడపకు కార్యక్రమంలో భాగంగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేస్తూ కేసీఆర్ రాష్ట్రంలో ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

జేజీఆర్ పాఠశాలలో దీపావళి వేడుకలు

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో శనివారం దీపావళి వేడుకలను వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు బాణసంచా కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఆనందోత్సవాల మధ్య మిఠాయిలు పంచుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ జె.గంగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్ స్కూల్‌లో బొమ్మల కొలువు

బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం దీపావళి వేడుకల్లో భాగంగా విద్యార్థులు ముత్యాల బొమ్మల కొలువు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ దీపావళి పండుగ జరుపుకునేటప్పుడు జాగ్రత్తలు వహించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను సాగనంపుదాం..



ప్రచారంలో ప్రసంగిస్తున్న వజ్రేష్‌యాదవ్



రోడ్ షోకు హాజరైన జనం



కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న కుతాడి రవీందర్

- జవహర్‌నగర్‌కు మల్లారెడ్డి చేసిందేమీ లేదు
- మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి
- కాంగ్రెస్‌లో చేరిన కుతాడి రవీందర్

జవహర్‌నగర్: పదేళ్ల బీఆర్‌ఎస్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని, 30వ తేదీన జరిగే ఓటింగ్‌లో హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ ప్రభంజనం సృష్టించేలా ప్రజలు తీర్పు ఇవ్వాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కుతాడి రవీందర్ జవహర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర నాయకులు హరివర్ధన్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జవహర్‌నగర్‌కు మంత్రి మల్లారెడ్డి చేసిందేమీ లేదని, తాను చేసిన అభివృద్ధే కనిపిస్తోందన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి తోటకూర వజ్రేష్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, నాయకులు కాయిత రాజుయాదవ్, వినయ్ కుమార్, రాజు, ప్రవీణ్‌యాదవ్, సదానందం, వేణు, మహిళ, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అధికారం ఇస్తే ప్రజలను అమ్మేస్తారు

మేడ్చల్: బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే రాష్ట్ర ప్రజలను అమ్మేస్తారని మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మేడ్చల్ పట్టణంలోని వివిధ వార్డులలో ఆయన ప్రచారం చేసి రోడ్‌షోలు నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డులు, అన్ని ప్రధాన రోడ్లలో ఆయన మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గాన్ని మంత్రి మల్లారెడ్డి నిలువునా దోచుకొని తన ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. మంత్రి ఆగడాలకు కాంగ్రెస్ అడ్డుకట్ట వేస్తుందని అన్నారు. ప్రజలకు కాంగ్రెస్ చెబుతున్న ఆరు గ్యారంటీలను అమలు చేసి చూపిస్తుందని అన్నారు. జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కౌన్సిలర్లు చాపరాజు, రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్ మండల, మున్సిపాలిటీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య విలువలు కాపాడండి

మేడ్చల్‌రూరల్: ప్రజలు ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలని, ప్రజల విలువలు కాపాడే వ్యక్తిని ఎన్నుకోవాలని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్‌తో కలిసి మేడ్చల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

- మంత్రి మల్లారెడ్డి కారణంలో మేడ్చల్ నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం మంటగలుస్తోందని, ప్రజాప్రతినిధులకు విలువలు లేకుండా పోయిందన్నారు. డబ్బు, అహంకారం, మదం తప్ప ఆలోచనా విధానం లేని వ్యక్తి మల్లారెడ్డి అని డబ్బులతో ఏదైనా కొనవచ్చనే ఆలోచనలో ఉండి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని చూస్తున్నాడని విమర్శించారు.
- నాడు నేనే మేడ్చల్‌కు కేసీఆర్‌తో కొట్లాడి రూ.44 కోట్లతో పనులు పూర్తి చేసి నీళ్లు ఇచ్చానన్నారు. పాలిటెక్నిక్ కళాశాల, విద్యుత్ సబ్‌స్టేషన్ వంటి ఎన్నో పనులు చేశానని, డిగ్రీ కళాశాలను సైతం మంజూరు చేయించానని, కానీ కేసీఆర్ ఇవ్వలేదన్నారు. 2018లో మల్లారెడ్డి వద్ద డబ్బులు ఉన్నాయనే.. తనని కాదని కేసీఆర్ ఎమ్మెల్యే టికెట్ ఇచ్చాడని, మేడ్చల్‌లో మల్లారెడ్డి, వల్లా రాజేశ్వర్‌రెడ్డిలు యూనివర్సిటీలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తున్నారని అన్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్ మాట్లాడుతూ మల్లారెడ్డి భూములు కబ్జా చేశాడే తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. కళాశాల సిబ్బందితో ఓటుకు రూ.15 వేలు పంచాలని చూస్తున్నాడని ఆరోపించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, మున్సిపల్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్ నడికొప్పు నాగరాజు, నాయకులు పోచయ్య, వరదారెడ్డి, బాల్‌రెడ్డి, రమణారెడ్డి, రాఘవేందర్‌గౌడ్, రంజిత్, నవీన్‌యాదవ్, వెంకటేశ్, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరుతున్న వారితో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



గోధుమకుంటలో కాంగ్రెస్ నేతల ప్రచారం



గుండ్లపోచంపల్లిలో వజ్రేశ్‌యాదవ్, సుధీర్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్

యువతకు ఉపాధి అవకాశాలు పెంచుతాం



యువతకు కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: రాష్ట్రంలో అభివృద్ధి–సంక్షేమం కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లికి చెందిన వివిధ పార్టీల యువత బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సాధించుకున్న తర్వాత సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. రాష్ట్రంలో పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి దిక్సూచిగా నిలిచాయన్నారు. పేదల కోసం అనేక పథకాలను అమలు చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఓట్లు వేసి మరోసారి గెలిపించాలన్నారు. ఎన్నికల వేళ మాయమాటలు చెప్పే కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. యువతకు ఉపాధి రంగంలో రాణించేందుకు అవకాశాలను పెంచుతామన్నారు. సొంత నిధులతో సీసీరోడ్లు, దేవాలయాల నిర్మాణాలు చేపట్టినట్లు చెప్పారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత చామకూర భద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు తేళ్ల శ్రీధర్, గండి అంజయ్యగౌడ్, అరిగే రాములు, కౌన్సిలర్లు గోక కళావతి, ఎలిజాల నాగేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మున్సిపల్ సెక్రటరీ శ్రీనివాస్, మచ్చా శ్రీనివాస్, వరకాల పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

దీపావళిని ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: దీపావళి పర్వదినాన్ని జిల్లా ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, ఈ పండగ ప్రజల జీవితాల్లో మంచిని తీసుకురావడంతో పాటు వారి జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆకాంక్షించారు. ఆదివారం దీపావళి పండగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా సంఘం డబ్బులు కాజేసిన వారిపై కేసు

పోచారం: మహిళా సంఘం డబ్బులు కాజేసిన వారిపై పోచారం పీఎస్‌లో శనివారం కేసు నమోదైంది. పోచారం ఐటీసీ పోలీసులు, ఏపీఎం తౌర్యానాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదరిగూడలోని స్త్రీనిధి మహిళ సంఘం అధ్యక్షురాలు కరుణ, సహాయకురాలు సువర్ణ స్త్రీనిధి పరపతి సహకార సమాఖ్యలో తీసుకున్న రుణం డబ్బులు రూ.7,10,846లు వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. 2022లో నవంబర్ 6న ఆడిట్‌లో బయటపడడంతో సభ్యులు ఒత్తిడి మేరకు రూ.1,20,846లు చెల్లించి చేతులెత్తేశారు. మిగిలిన డబ్బులు చెల్లించకపోవడంతో పాటు బెదిరింపులకు పాల్పడంతో శనివారం సమాఖ్య అధ్యక్షురాలు భార్గవి, ఏపీఎం తౌర్యానాయక్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కేసీఆర్ కృషితోనే తండాల అభివృద్ధి

- మళ్లీ వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే..
- గిరిజన బంధు తప్పకుండా వస్తది.
- రాష్ట్ర మంత్రి హరీష్‌రావు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేసీఆర్‌కు ముందు తండాల పరిస్థితి ఏంది. ఇప్పుడు ఏంది.. ఆనాడు తాగునీళ్ల కోసం ఎంత కష్టపడ్డారో చూడండి. నారాయణఖేడ్‌లో బిందెలతో గిరిజనులు ఎన్నో పోరాటాలు చేశారు. ఆనాడు మంచం ఎక్కిన తండా.. విష జ్వరాలతో గిరిజన గూడాలు అని పేపర్లలో హెడ్డింగ్‌లు.. ఇవాళ తాగునీటి కష్టాలు లేవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు తెలిపారు. శనివారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా తూంకుంట పుష్ప కన్వెన్షన్‌లో రాష్ట్రస్థాయి గిరిజనుల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. సమ్మేళనానికి మాజీ ఎంపీ ప్రొఫెసర్ సీతారాంనాయక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తరువాత సీఎం కేసీఆర్ అన్ని తండాలను గ్రామ పంచాయతీలు చేశారన్నారు. రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇచ్చింది కేసీఆరే.. పట్టాలు ఒక్కటే కాదు రైతు బంధు ఇచ్చింది కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. ప్రతి గిరిజన బిడ్డ చదువుకోవాలని గిరిజన గురుకుల పాఠశాలు ఏర్పాటు చేసింది. విదేశీ విద్య పథకం పెట్టి ఎంతో మంది గిరిజన బిడ్డలకు విదేశీ విద్యను అందించింది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనన్నారు. గిరిజనులు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం కేసీఆర్ తండాలను గ్రామపంచాయతీలు చేశారని రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎంపీ ప్రొ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యే సత్తన్న, రాష్ట్ర గిరిజన నాయకులు రామచంద్రునాయక్, సూరయ్య, కృష్ణప్రసాద్, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విధులను బాధ్యతతో నిర్వర్తించాలి



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేసేందుకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో చేపట్టిన చర్యలపై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ఎన్నికల సాధారణ పరిశీలకులు, పోలీస్ జనరల్ అబ్జర్వర్లు, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి, రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై చర్చించి తుది ఓటర్ల జాబితాను వెల్లడించారు.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఓటర్లు 28,19,067 కాగా, వారిలో పురుషులు14,59,629. స్త్రీలు 13,59,057, థర్డ్ జెండర్ 381 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 438 లోకేషన్స్‌లో 2,397 పోలింగ్ స్టేషన్లు ఉండగా, వీటిలో అర్బన్ పోలింగ్ స్టేషన్లు 2,239 ఉన్నాయని పేర్కొన్నారు. రూరల్‌లో 158 పోలింగ్‌స్టేషన్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడీఓసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అధునాతన పీటీజెడ్ కెమెరాలను ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని పేర్కొన్నారు.
- అభ్యర్థులు, పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.
- సరిహద్దు ప్రాంతాల్లో 14 చోట్ల చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసి నియోజకవర్గ కేంద్రాలకు తరలించి స్ట్రాంగ్ రూంలలో భద్రపర్చామని, పోలింగ్ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, రిటర్నింగ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రిక్విల్డ్ ఫోర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో వింటర్ కార్నివాల్



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలో రిక్వెల్డ్ ఫోర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన వింటర్ కార్నివాల్ కార్యక్రమాన్ని మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో అన్ని వసతులతో కూడిన ఇంటర్నేషనల్ స్థాయి స్కూల్ కొనసాగుతుండటం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, వైస్ చైర్మన్ విద్యాశ్రవంతి, మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.